ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 16 జూలై 2024



మింగేసేలా.. మిద్దెలు..!

కూలిన గోడలు.. పైకప్పులు
వాటిలోనే పేదల కాపురాలు

నాలుగు వేల ఇళ్లున్న పల్లె అది. సుమారు వెయ్యి కుటుంబాలవారు ఇప్పటికీ మట్టి మిద్దెల్లోనే ఉంటున్నారు. వాన కురిసిన ప్రతిసారీ గోడలు కూలుతూనే ఉంటాయి. పై కప్పులకు రంధ్రాలు పడుతుంటాయి. ఆ ఇళ్లను చూస్తేనే భయం వేస్తుంది. అయినా.. గత్యంతరం లేక పేదలు వాటిలోనే నివసిస్తున్నారు. పక్కా ఇళ్లను నిర్మించుకోవాలని కొందరు ఆశించినా.. రాజకీయ కారణాలతో మంజూరు కాలేదని వాపోతున్నారు. ఈ కారణంగా ఓ మట్టి మిద్దె కూలి కోనప్పగారి మారెప్ప, లక్ష్మిదేవి దంపతులు ప్రాణాలు కోల్పోయారు. విడపనకల్లు మండలం హావళిగిలో పరిస్థితి ఇది. ఇంకో ప్రమాదం జరగకనే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. మట్టి మిద్దెల్లో ప్రాణ భయంతో గడుపుతున్నవారికి ప్రత్యామ్నాయం చూపాలి.



గోడ కూలిన ఈ ఇంట్లో మారెక్క కుటుంబం ఉంటోంది..

మట్టి మిద్దెలో ఉంటున్నాం..



నేను, మా అన్న 15 ఏళ్ల క్రితం మట్టి మిద్దెను నిర్మించుకున్నాము. తీర్లు, తడి కెలు, మట్టితో పైకప్పు వేసుకున్నాము. మా అన్న మిద్దె రెండేళ్ల క్రితం వర్షాలకు దెబ్బతింది. ఇంటి లోపలిభాగం కూలిపోయింది. ఆ రోజు అందరూ ముందు గదిలో నిద్రించటం వల్ల ప్రాణాపాయం జరగలేదు. జగనన్న ఇల్లు ఇవ్వమని అడిగితే.. 'మీరు టీడీపీ వాళ్లు. మీకు ఇళ్లను ఇవ్వలేము. మీ ప్రభుత్వం వస్తే కట్టుకోండి' అన్నారు.

- చక్రవర్తి, హావళిగి

టీడీపీకి ఓటేశామని..



'మీరు టీడీపీ పనిచేశారు. మీకు మా ప్రభుత్వంలో ఇళ్లను ఇవ్వం' అని వైసీపీ నాయకులు మమ్మల్ని దూరం పెట్టారు. ఐదేళ్లపాటు తిరిగినా స్పందించలేదు. మా కుటుంబం మట్టి మిద్దెలో ఉంటోంది. నాలుగు రోజుల క్రితం చిన్నపాటి వర్షానికి ఓ పక్క గోడ కూలి పోయింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం భయంగా గడుపుతున్నాం. కొత్త ప్రభుత్వం మాకు ఇంటిని నిర్మించి ఇచ్చి ఆదుకోవాలి.


- మారెక్క, హావళిగి

కాళ్లకు మొక్కినా..



నేను పెళ్లి చేసుకుని హావళిగి గ్రామానికి వచ్చి 12 సంవత్సరాలు అవుతోంది. అప్పటి నుంచి ఎంతోమంది నాయకుల కాళ్లు పట్టుకున్నా. మాకు ప్రభుత్వ ఇంటిని మంజూరు చేయమని విన్నవించాను. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితం ఓ వైపు గోడ కూలిపోయింది. గత ఏడాది మరో వైపు గోడ పడింది. ఇప్పుడు చిన్నపాటి వర్షానికి బండ రాయి విరిగి రంధ్రం పడింది. చుట్టూ గోడలకు నెర్రులు వచ్చాయి. మా ఇల్లు ఎప్పుడు కూలిపోతుందో అని భయంగా ఉంది. మాలాంటి వారికి ఎవరూ సాయం చేయటం లేదు. మేం టీడీపీ వాళ్లమని వైసీపీ నాయకులు మమ్మల్ని ఇంకా దూరం పెట్టారు. టీడీపీ ప్రభుత్వమైనా మాకు న్యాయం చేయాలి.

- నాగవేణి, హావళిగి





పైకప్పునకు రంధ్రం పడిన ఇల్లు

పక్కా ఇళ్లకు రాజకీయ గ్రహణం
ఊరికి దూరంగా జగనన్న కాలనీ
పేదలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

విడపనకల్లు, జూలై 15: ఎకరం విలువ కనీసం రూ.5 లక్షలు చేయదు. కానీ వైసీపీ హయాంలో ఎకరానికి రూ.28 లక్షలు వెచ్చించి భూములను కొనుగోలు చేశారు. జగనన్న కాలనీ పేరిట హావళిగి గ్రామ సర్వే నంబరు 297లో 6.13 ఎకరాలను ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో సేకరించారు. కొండకు ఆనుకుని ఉన్న ఆ భూమిలో 265 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా.. 206 మందికి ఇచ్చారు. ఈ జాబితాలో ఇళ్లు లేని ఎస్సీలు, బీసీలు లేరు. వైసీపీ ప్రభుత్వానికి వీరు కనిపించ లేదు. మట్టి మిద్దెలలో ఉంటున్నవారికి ప్రాధాన్యం ఇచ్చి.. ఇళ్లను నిర్మించి ఇచ్చుంటే రెండు నిండు ప్రాణాలు పోయేవి కాదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు తమ జేబులు నింపుకోవటం కోసం వెంపర్లాడారే తప్ప.. పేదలకు న్యాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కార్యకర్తలు అంటేనే ప్రభుత్వ పథకాలకు ఆమడ దూరంలో పెట్టారు. హావళిగిలో టీడీపీ మద్దతుదారులకు ఏ ఒక్కరికీ జగనన్న ఇళ్లను ఇవ్వలేదు. అర్హత ఉన్నా.. పేదల పట్ల బాధ్యతగా వ్యవహరించలేదు. వైసీపీ వర్గీయులకు ఇళ్లున్నా.. జగనన్న ఇళ్లను మంజూరు చేశారని బాధితులు విమర్శిస్తున్నారు.

అప్పట్లో బిల్లులు కాజేశారు..

వైఎస్సార్ హయాంలో అప్పటి కాంగ్రెస్ నాయకులు పేదల రేషన్ కార్డులను ఉపయోగించుకుని బిల్లులు చేసుకున్నారు. వారికి పక్కా ఇళ్లను మంజూరు చేసినట్లు చూపించి.. గోల్‌మాల్ చేశారు. ఈ విషయం తెలియక.. పక్కా ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న బాధితులకు ఆన్‌లైన్‌లో సమస్య ఎదురైంది. అప్పటికే వారి రేషన్ కార్డుపై ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణం బిల్లులు తీసుకున్నట్లు చూపించింది. కాబట్టి ఇళ్లను మంజూరు చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. తమకు ఆ విషయమే తెలియదని, విచారించి న్యాయం చేయాలని బాధితులు కోరినా ఎవరూ పట్టించుకోలేదు.

దారిలేని చోట..

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి దారి లేదు. కాలనీలో రూ.కోట్లు వెచ్చించి విద్యుత్ స్తంభాలు, నీటి ట్యాంక్‌లు, మట్టి రోడ్లు ఏర్పాటు చేశారు. కానీ గ్రామానికి దూరంగా ఉన్న ఆ కాలనీకి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయలేదు. పైగా, ఎకరం రూ.5 లక్షలు చేయని వైసీపీ నాయకుడి భూమికి రూ.28 లక్షల ప్రకారం ఇచ్చారు. దీనిపై నాలుగేళ్ల క్రితం పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. ప్రజా ధనాన్ని కాజేసే విషయంలో వైసీపీ నాయకుల మధ్య కోల్డ్‌వార్ సాగింది. కాలనీలో 206 మందికి ఇళ్లను మంజూరు చేస్తే.. ఇప్పటి వరకూ కేవలం ఆరుగురు ఇళ్లను నిర్మించుకున్నారు. ఇప్పటికే కాలనీపై సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేశారు. అయినా గ్రామస్థులకు ఉపయోగపడలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం స్పందించి.. అర్హులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బేస్‌మెంట్ వద్ద నిలిచిపోయిన జగనన్న ఇల్లు

ప్రజాఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు
ఎక్కువ అర్జీలు వచ్చే శాఖను తనిఖీ చేస్తా
అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరిక



వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు, జేసీ, ఇతర అధికారులు

అనంతపురం టౌన్, జూలై 15: ప్రజా ఫిర్యాదుల వేదికకు అర్జీలు ఎక్కువగా వచ్చే శాఖలను తనిఖీ చేస్తానని కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 380 మంది బాధితులు వచ్చి కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి వారం అర్జీలు పెరుగుతున్నాయా.. తగ్గుతున్నాయా అని ప్రతి శాఖ అధికారీ పరిశీలించుకోవాలని సూచించారు. ఏ శాఖ పరిధిలో ఎన్ని అర్జీలు వచ్చాయో తనకు తెలియజేయాలని, ఎక్కువ అర్జీలు వచ్చిన శాఖల తనిఖీకి ఆకస్మికంగా వస్తానని అన్నారు. ముందుగానే సరిదిద్దుకోవాలని సూచించారు. పదేపదే అర్జీలు వచ్చినా, వాటి పట్ల నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, పాఠశాలలో సీట్లు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలతో ఎస్ఓపీలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ల్యాండ్, సివిల్ సప్లై, వ్యవసాయం, హార్టికల్చర్ తదితర శాఖలను జేసీ పర్యవేక్షిస్తారని తెలిపారు. విద్య, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యుఎస్, సంక్షేమ శాఖలను జడ్పీ సీఈఓ పర్యవేక్షిస్తారని, మెప్మా, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ శాఖలు, హెచ్ఎల్‌సీ, హంద్రీనీవాను నగరపాలిక కమిషనర్ పర్యవేక్షిస్తారని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల వ్యవహారం డీఆర్ఓ చూస్తారని అన్నారు. వచ్చేవారంలో ఎంఈఓలతో కమిటీ వేసి, జిల్లాలో అన్ని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయించాలని డీఈఓకు సూచించారు. లోపాలను గుర్తించి నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియ, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్వో రామక్రిష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక మొదలు పెట్టండి

పంచాయతీ రాజ్ శాఖలో ఆగిపోయిన అభివృద్ధి పనులను మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆ శాఖపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్, ఎస్డీపీ, 15వ ఆర్థిక సంఘం, అంగన్‌వాడీ భవనాలు, బీఎంసీయూ, డిజిటల్ లైబ్రరీ, సీసీ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే శనివారంలోగా పీఎంజీఎస్‌వై కింద రాయదుర్గం-భూపసముద్రం, ఉరవకొండ-కణేకల్లు రహదారుల నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమీక్షలో ఎస్ఈ కేవీకే ప్రసాద్, ఈఈ చంద్రశేఖర్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించండి

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాలలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ప్రతి రైతుకు 2 నుంచి 4 హెక్టార్ల వరకు ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని తెలిపారు. రియ, ఎంకే, ఆగ్రోటెక్, ఆయిల్ ఎస్‌గ్యాస్ సర్వీసెస్ కంపెనీలకు ఆయిల్‌పామ్ సాగు బాధ్యతలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రేషన్ దుకాణానికి తాళం
మూడు నెలలుగా బియ్యం ఇవ్వలేదని..



వీఆర్వోతో వాగ్వాదానికి దిగిన కార్డుదారులు

యాడికి, జూలై 15: మూడు నెలలుగా తమకు రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. యాడికి మండలం పిన్నేపల్లిలో రేషన్ దుకాణానికి లబ్ధిదారులు సోమవారం తాళం వేశారు. గ్రామంలో ఐదారుగురికి మాత్రమే రేషన్ బియ్యం వేస్తున్నారని, మిగిలినవారికి ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. అధికారులను ప్రశ్నిస్తే స్టాక్ తక్కువగా వచ్చిందని కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రతి నెలా తమ గ్రామానికే బియ్యం తక్కువగా ఎలా వస్తుందని ప్రశ్నించారు. రేషన్ బియ్యం వేయడానికి వెళ్లిన రాము అనే వ్యక్తిని రేషన్ దుకాణంలో బంధించి తాళం వేశారు. సమాచారం అందుకున్న సచివాలయ వీఆర్వో శ్రావణ్‌కుమార్ గ్రామానికి వెళ్లి కార్డుదారులతో మాట్లాడారు. మంగళవారం సాయంత్రంలోగా రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రేషన్ దుకాణం తాళం తీయించారు.

పింఛన్ సొమ్ము మింగేశాడు..!
● రామగిరిలో ఓ ఉద్యోగి నిర్వాకం

అనంతపురం విద్య, జూలై 15: రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే ఓ జూనియర్ అసిస్టెంట్.. పింఛన్ డబ్బును కాజేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామగిరి పంచాయతీలో లబ్ధిదారులకు ఈ నెల మొదటివారంలో ఫించన్ డబ్బులను పంపిణీ చేశారు. మంజూరైన సొమ్ములో రూ.1.40 లక్షలు మిగిలింది. ఆ డబ్బులను జూనియర్ అసిస్టెంట్‌కు స్థానిక సచివాలయ ఉద్యోగి వెనక్కు ఇచ్చారు. ఆ మొత్తానికి పింఛన్ అన్‌డిస్బర్స్‌మెంట్ ఖాతా పేరిట చలానా తీసి.. సీఎఫ్ఎంఎస్ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. కానీ జూనియర్ అసిస్టెంట్ జమ చేయలేదు. విషయం తెలుసుకుని అధికారులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో సచివాలయ ఉద్యోగితోపాటు, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు హైరానా పడ్డారు. అందరూ కలిసి ప్రశ్నించడంతో రూ.80 వేలు సచివాలయ ఉద్యోగికి వెనక్కు ఇచ్చినట్లు సమాచారం. ఈ మొత్తాన్ని సదరు ఉద్యోగికి డిజిటల్ పేమెంట్ చేసినట్లు తెలుస్తోంది. మరో రూ.60 వేలు పెండింగ్ ఉంచినట్లు సమాచారం. ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సచివాలయ ఉద్యోగి ఈ విషయాన్ని డీఆర్‌డీఏ పీడీ, ఇతర ఉన్నతాధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పింఛన్ సొమ్ము కాజేసిన ఉద్యోగి అనారోగ్యం పేరిట సెలవు పెట్టినట్లు తెలిసింది.

ఆయనొక్కరే తింటున్నారు..!
ఎస్పీకి ఆకాశ రామన్న ఉత్తరం



యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో దిగువస్థాయి అధికారి ఒకరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విసిగిపోయిన సిబ్బంది.. ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ అధికారి తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోనే కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ మండలాల్లో బాగా పట్టు సాధించాడు. యల్లనూరు స్టేషన్‌లో తరచుగా ఎస్ఐలు మారుతుండడం ఆయనకు వరంగా మారింది. ఎస్ఐగా ఎవరు వచ్చినా.. తాను చెప్పినట్లే నడుచుకునేలా చేస్తాడట. ఎస్ఐ గిరిబాబు రెండు నెలలు క్రితం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఎస్ఐ స్థానం ఖాళీగా ఉంది. దీంతో ఆ అధికారి చెప్పిందే వేదం అన్నట్లు స్టేషన్‌లో సాగుతోంది. ఏదైనా సమస్యపై స్టేషన్‌కు వచ్చేందుకు ప్రయత్నిస్తే.. వారిని బయటే ఆపి.. పంచాయితీలు చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పంచాయితీల డబ్బును తానొక్కడే తీసుకుంటున్నాడని సిబ్బందిలో కొందరు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన 'ఫండ్'ను సెలవులో ఉన్న ఓ అధికారి, ఈ అధికారి కలిసి తీసేసుకున్నారట. ఎవరి వాటా వారికి ఇవ్వకపోవడంతో గొడవ ముదిరినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆ అధికారిపై ఎస్పీకి 'ఆకాశ రామన్న' ఉత్తరం రాశారని తెలిసింది. దీంతో స్పందించిన జిల్లా ఎస్పీ, మూడు రోజుల క్రితం డీఎస్పీ శివారెడ్డికి విచారణ బాధ్యతలు అప్పగించారని తెలిసింది. రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీ, ఒక్కొక్కరిని లోపలికి పిలిచి ఆకాశరామన్న ఉత్తరాన్ని చూపి.. ఎవరు రాశారని ఆరా తీసినట్లు తెలిసింది. అందులో నిజానిజాల గురించి కూడా సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వివాదం నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి.. ఆ అధికారికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది.

- యల్లనూరు

టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీటి నిల్వ



బొమ్మనహాళ్, జూలై 15: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సోమవారానికి 33.07 టీఎంసీలకు పెరిగింది. ఇన్‌ఫ్లో 16,142 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 211 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తుంగభద్రకు చేరాల్సిన వరదనీరు ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత వారం వచ్చిన వరదనీరు ప్రస్తుతం తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

టమోటా కిలో రూ.48



అనంతపురం రూరల్, జూలై 15: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 150 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.25 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురం రూరల్, జూలై 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 723 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇంకేం భయం లేదు !

- పేదింటి బిడ్డల చదువు బాధ్యత తీసుకున్న ప్రభుత్వం
- నేరుగా కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్
- విద్యార్థులకు తప్పనున్న ఫీజుల భారం
- రాబోయే ఫలాలకు ఇది పెట్టుబడి: నిపుణులు
- నాణ్యమైన విద్యనందించడమే కళాశాలల పని

అనంతపురం సెంట్రల్, జూలై 13: ఆర్థిక సమస్యలతో పేదింటి బిడ్డల పెద్ద చదువులు ఆగిపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం తపిస్తోంది. అందుకే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు చెల్లించే బాధ్యత తీసుకుంది. ఈఏపీసెట్ ద్వారా 2024-25 విద్యా సంవత్సరం బీటెక్‌లో కన్వీనర్ కోటా ద్వారా 40891 సీట్లలో చేరబోయే పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లించనుంది. ఇందుకోసం రూ.206 కోట్లను కూటమి ప్రభుత్వం ఖర్చు చేయనుంది. వీటితోపాటు ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం విద్యార్థులకు దాదాపు రూ.400 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంటే ఒక్క ఏడాదికి బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్థులపై రూ.600కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. కాగా ఈఏపీసెట్‌లో అర్హత సాధించని వారు, కన్వీనర్ కోటాలో సరైన ర్యాంకు రాక కోరుకున్న కళాశాలలో చదవాలనుకున్న వారు మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్ తీసుకుంటారు.

మేనేజ్‌మెంట్ కోటాలో ఫీజుల మోత

జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా నాలుగు కానిస్టిట్యూయేట్, 67 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. ఎస్కేయూ క్యాపస్, బెస్ట్ యూనివర్సిటీ, ఆచార్య ఎన్‌జీ రంగ అగ్రికల్చర్ అనుబంధంగా కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజ్ (మడకశిర) మొత్తం 74 కళాశాలలున్నాయి. వీటిలో 40891 సీట్లను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కన్వీనర్ కోటా కింద కేటాయించింది. కళాశాల వారిగా ఫీజుల మొత్తాన్ని నిర్ధారించింది. ప్రైవేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద 30శాతం సీట్లు ఉంటాయి. కన్వీనర్ కోటా ఫీజు మొత్తానికి మూడు రెట్లు అధికంగా మేనేజ్‌మెంట్ కోటాలో వసూలు చేసుకునే అవకాశాన్ని ప్రైవేట్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.

కళాశాలలదే బాధ్యత

ప్రతి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటాకింద చేరిన పేదల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. కోర్సులకు అనుగుణంగా ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర వాటిలో మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యనందించే బాధ్యత కళాశాలలదే. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలు పడిపోయాయి. రాజకీయ పలుకుబడితో కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల మొత్తాలను అధికంగా పెంచుకున్నారు. వీటితోపాటు బిల్డింగ్, ట్రైనింగ్, స్కిల్స్ ఇలా అనేక రకాలుగా అదనంగా విద్యార్థులతో దండుకున్నారు. అయినా నాణ్యమైన విద్యనందించకపోవడంతో డిగ్రీలు పొందిన విద్యార్థులు ఉద్యోగాలు లభించక నిరుద్యోగులకు ఉంటున్నారని వారి తల్లిదండ్రులు మండిపడుతున్నారు.



జేఎన్‌టీయూ

మెరుగైన అవకాశాలే నిదర్శనం



విద్యాభ్యాసం ముగిసిన అనంతరం విద్యార్థులు అందుకునే మెరుగైన అవకాశాలే రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడికి నిదర్శనం. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల రూపంలో ప్రతి పేద విద్యార్థికి సొమ్ము చెల్లించేలా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రచించుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బంది పెట్టింది.

- కుమ్మతి బాలకృష్ణ, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు.

ఆశలు చిగురించాయి



కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఫీజుల సమస్యలన్నీ తీరుతాయన్న ఆశలు విద్యార్థుల్లో చిగురించాయి. ఈ ప్రాంతంలోని జేఎన్‌టీయూ, ఎస్కేయూ తదితర విద్యాసంస్థల పరిధిలో దాదాపు 40వేలమంది విద్యార్థులు బీటెక్‌లో కన్వీనర్ కోటాకింద చేరబోతున్నారు.

- తరిమెల గిరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు.

కాళ్లరిగేలా తిప్పారు



విద్యాదీవెనకోసం కాళ్లరిగిలా తిప్పారు. సచివాలయానికి వెళ్తే బ్యాంక్‌లో చెక్ చేయమన్నారు. అక్కడికెళ్తే పోస్టాఫీస్ కెళ్లమన్నారు. ఇలా అన్నింటి చుట్టూ తిరగాల్సి వచ్చింది. అయినా రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. దీంతో కళాశాలకు సొంతంగా ఫీజు కట్టా. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నేరుగా కళాశాలకే ఫీజుకట్టేలా చర్యలు తీసుకోవాలి.

- భాను ప్రకాష్, బీటెక్ నాలుగో సంవత్సరం

గొప్పలకు పోయారు



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వారే కొత్తగా ఇస్తున్నట్లు గత ప్రభుత్వంలో గొప్పలకు పోయారు. జేవీడీ పేరుతో విద్యార్థి, విద్యార్థి తల్లికి జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయించారు. దరఖాస్తుకు ఒకసారి, విడుదల చేసిన తరువాత మరోసారి సచివాలయంలో వేలిముద్రలు వేయించుకున్నారు. అయినా పూర్తిగా ఫీజు ఇవ్వలేదు.

-బాలశివ, బీటెక్ చివరి సంవత్సరం

కళాశాలలకే చెల్లించాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను కళాశాలలకే నేరుగా చెల్లించి విద్యార్థులకు ఫీజు బాధలు తప్పించాలి. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై పెట్టుబడిగా పెట్టిన సొమ్ముకు సార్థకత ఉంటుంది. ఫీజులు కట్టాలన ఆలోచన లేకుండా చదువుపై శ్రద్ధపెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చు కోవడానికి అవకాశం ఉంటుంది.

- చంద్ర, బీటెక్ ఫైనల్ ఇయర్

హర్షణీయం



కళాశాలకు ఫీజు బకాయి ఉన్నామన్న భయం విద్యార్థుల్లో తొలగించి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం శుభ పరిణామం. ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతిపైసా ఒక పెట్టుబడే. దీని ఫలాలు విద్యార్థులు ప్రయోజకులుగా మారి చేసే సేవలో సమాజానికి అందుతాయి. ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం హర్షణీయం

-క్రిష్ణయ్య, ప్రొఫెసర్, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు తొడిగిన కలెక్టర్



దివ్యాంగుడికి కృత్రిమ కాలును తొడిగిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 15: దివ్యాంగుల పట్ల కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ మానవత్వం చాటుకున్నారు. కాళ్లలేని పుట్లూరు మండలం కందిగోపుల గ్రామానికి చెందిన రామయ్య, ఆత్మకూరు మండలం బీయాలేరుకు చెందిన ఓబులమ్మ, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన భాగ్యమ్మలకు ప్రభుత్వం నుంచి కృత్రిమ కాళ్లు మంజూరయ్యాయి. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జరుగుతున్న మీకోసం కార్యక్రమంలో ఈ కృత్రిమ కాళ్లను ఆ ముగ్గురికి అందజేశారు. కలెక్టరు వినోద్ కుమార్ నేరుగా దివ్యాంగుల వద్దకు వచ్చి స్వయంగా ఆ కృత్రిమ కాళ్లు తొడిగించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ దివ్యాంగుల విషయంలో ఎవరు ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కృత్రిమకాళ్లు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకల్లో ప్రమాదం

విడపనకల్లు, జూలై 15: మండలంలోని పొలికి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున మొహరం వేడుకల్లో పాల్గొన్న ఓ వ్యక్తి గాయపడ్డాడు. గ్రామంలోని పీర్లకు సోమవారం తెల్లవారు జామున అగ్ని గుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పీరు ఎత్తుకుని అగ్ని గుండంలోకి దిగాడు. బయటకు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గుండంలో పడిపోయాడు. గ్రామస్థులు వెంటనే ఆయన్ను బయటకు తీశారు. అప్పటికే కాళ్లు, చేతులు కాలి గాయాలు తీవ్రంగా అయ్యాయి. బాధితుడిని వెంటనే ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.



అగ్నిగుండంలో పడి గాయపడిన లక్ష్మీనారాయణ

డిగ్రీలో 77శాతం మంది పాస్

అనంతపురం సెంట్రల్, జూలై 15: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో 77శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. పరీక్షల నిర్వహణ విభాగాధిపతి జీవీ రమణ ఆధ్వర్యంలో రెక్టార్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ లక్ష్మయ్య సోమవారం ఫలితాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ డిగ్రీ బీఏ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ విదార్థులకు ఏప్రిల్‌లో ఆరో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 10906 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8468మంది పాస్ అయ్యారని తెలిపారు. దీంతో పాస్ శాతం 77.65గా నమోదైనట్లు పేర్కొన్నారు.

నేడు గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు



అలంకరణలో ఆంజనేయస్వామి



కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, జూలై 15: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయి స్వామి పెద్ద సరిగెత్తు మంగళవారం జరగనున్నట్లు ఆలయ ఈఓ శోభా తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కుళ్లాయి స్వామికి విడిది కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. భారీగా భక్తులు హాజరయ్యే పెద్దసరిగెత్తు కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 17న జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కన్నుల పండువగా ఖాసీంస్వామి గ్రామోత్సవం

బత్తలపల్లి, జూలై 15: మండలకేంద్రంలో ఖాసీం స్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ ఉత్సవాలకు గూగుడు తర్వాత అంతటి ప్రాధాన్యం ఉంది. ఖాసీం స్వామిని సోమవారం రక రకాల పుష్పాలు, ఆభరణాతో అలంకరించారు. తప్పెట్లు, మేళాల మధ్య స్వామివారిని తెల్లవారుజామున 5గంటలకు గుడి నుంచి బయటకు తెచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు ఖాసీంస్వామి నామ స్మరణతో మార్మోగాయి. గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పినపెద్ద జక్కంపూటి వెంకటేశు సమాధి వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు వచ్చి ఖాసీం స్వామితో భేటీ తీసుకున్నాయి. కార్యక్రమములో జక్కంపూటీ సత్యానారాయణ. తిరుపాలు, పురుషోత్తమచౌదరి, సుబ్బరాయుడు, జయప్ప, గోపాల్, అశోక్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాసీం స్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పానకదుత్తలు స్వామి వారికి సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న ఖాసీంస్వామి

15 మండలాల్లో వర్షం



అనంతపురం నగరంలో వానలో వాహనదారులు

అనంతపురం అర్బన్, జూలై 15: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. అనంతపురం, యాడికి, శింగనమల, పామిడి, బెళుగుప్ప, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, గార్లదిన్నె, పుట్లూరు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 15 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం పడింది. కళ్యాణదుర్గంలో 7.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 5.2, బొమ్మనహాళ్, గుంతకల్లులో 4.4, డీ.హీరేహాళ్, యాడికి, తాడిపత్రిలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 3.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

నేడు లేపాక్షికి షిప్పింగ్ చైర్మన్

లేపాక్షి, జూలై 15: కేంద్ర అంతర్గత జల(షిప్పింగ్) చైర్మన్ విజయ్‌కుమార్ మంగళవారం లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు ఆయన ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

న్యాయాధికారిని నియమించండి

హైకోర్టు జడ్జికి బార్ అసోసియేషన్ సభ్యుల వినతి



హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

తాడిపత్రి, జూలై 15: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డిని బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సభ్యులు పుష్పగుచ్ఛం అందించారు. స్థానిక కోర్టులో న్యాయాధికారి స్థానం ఖాళీగా ఉందని, దీంతో కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలోనే దాదాపు ఏడు వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వెంటనే న్యాయాధికారిని నియమించాలని వినతిపత్రం అందజేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి తెలిపారు. దీనిపై విజయవాడ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిని కలవాలని జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి వారికి సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సెక్రటరీ శ్రీనివాసులు, ప్రసాద్, సహదేవరెడ్డి, సూర్యనారాయణ, సాహుల్, శివ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

- సెంట్రల్ వర్సిటీ అధికారులకు ఎంపీ సూచన

అనంతపురం సెంట్రల్, జూలై 15: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన వర్సిటీని సందర్శించి అకడమిక్, అడ్మిస్ట్రేషన్ అంశాలపై చర్చించారు. ఎంపీ మాట్లాడుతూ కోర్సులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలతో కూడిన సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్సిటీకి అవసరమైన నిధులను విడుదల చేయించేలా కృషిచేస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వర్సిటీ అభివృద్ధిని విస్మరించడమే కాకుండా నిధులు రాబట్టడంలో విఫలమైందని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీని వర్సిటీ వీసీ కోరి సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు షీలారెడ్డి, ఉమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న వీసీ కోరి

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ బాధ్యతల స్వీకరణ



నూతన పీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15: డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఓబుళమ్మ బాధ్యతలు స్వీకరించారు. డీఎల్‌డీఓగా ఉన్న ఓబుళమ్మను డీఆర్‌డీఏ-వెలుగు పీడీ(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఓబుళమ్మ అనంతరం డీఆర్‌డీఏ-వెలుగు పీడీ కార్యాలయంలో ఈశ్వరయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈశ్వరయ్యతో పాటు పలువురు డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలు ఓబుళమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడం, అర్హులందరికీ పింఛన్‌లు అందజేయడం, బోగస్ పింఛన్లను ఏరివేయడంపై సమష్టిగా పనిచేయాలని సిబ్బందిని నూతన పీడీ కోరారు.

చేనేతల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

జేసీఐపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రుషింగప్ప



నినాదాలు చేస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 15: గత వైసీపీ ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని విస్మరించి వారికి ఉపాధి లేకుండా చేసిందని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ(జేసీఐపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి రుషింగప్ప మండిపడ్డారు. చేనేత సంక్షేమ పథకాలను పునఃప్రారంభించాలని సోమవారం జేసీఐపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రుషింగప్ప మాట్లాడుతూ 2014-19లో టీడీపీ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి చేనేతలను ప్రోత్సహించిందన్నారు. అయితే వైసీపీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మల్లికార్జున, సోమశేఖర్, శ్రీనివాసులు, నరసింహులు, గోపాల్, రామచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

నార్పల, జూలై 15: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు అనంతపురం డీఎస్పీ టీవీ శివారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్పలలో బాలిక పట్ల జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు నాగరాజు అసభ్యంగా ప్రవర్తించిన ఘనటపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఆదివారం జరిగిన ఘటనపై నార్పల పోలీసు స్టేషన్‌లో పోక్సో, ఎస్సీఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చమన్‌సాబ్ జయంతి


చమన్‌సాబ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్/రామగిరి, జూలై 15: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చమన్‌సాబ్ 65వ జయంతి వేడుకలను ఆయన సతీమణి రమీజా, తనయుడు ఉమర్‌ముక్తార్, టీడీపీ నాయకులు మధ్య ఘనంగా నిర్వహించారు. సోమవారం కొత్తపల్లి గ్రామంలోని చమన్‌సాబ్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నగరంలో బైకు ర్యాలీ నిర్వహించి జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో అభిమానుల మధ్య ఉమర్‌ముక్తార్ భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులకు అన్నదానం చేశారు. ఉమర్ ముక్తార్ మాట్లాడుతూ చమన్‌సాబ్ దూదేకులు, ముస్లిం మైనార్టీ కోసం ఎంతో పరితపించారన్నారు. ఆ వర్గాల అభివృద్ధికి జిల్లా పరిషత్ చైర్మన్ హోదాలో అనేక సేవాకార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన ఆశయాలను మున్ముందు కొనసాగిస్తామన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారుడికి ఘన స్వాగతం


ద్వారకానాథ్‌రెడ్డికు స్వాగతం పలుకుతున్న మాంటిస్సోరి విద్యార్థులు

అనంతపురం విద్య, జూలై 15: టీం ఇండియా బాస్కెట్ బాల్ జట్టు క్రీడాకారుడికి మాంటిస్సోరి విద్యాసంస్థల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతపురానికి చెందిన క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డి ఇటీవల శ్రీలంకలో జరిగిన ఎఫ్‌ఐబీఏ అండర్-18 ఆసియా కప్-2024 బాస్కెట్ బాల్ పోటీల్లో టీం ఇండియా జట్టు తరఫున పాల్గొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. జిల్లాకు వస్తున్న ఆయనకు మాంటిస్సోరి విద్యాసంస్థల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, విద్యార్థులు సోమవారం రాప్తాడు సమీపంలోని టోల్‌గేట్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా నగరంలోకి వచ్చారు. కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి ఇండియా జట్టు క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్లు పద్మావతి, రమాదేవి, టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు


సమికకు పతకాన్ని అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15: విజయవాడలో మూడు రోజులుగా నిర్వహించిన స్పార్క్ చెస్ అకాడమీ 2వ అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. అండర్-11 బాలురలో ప్రథమ స్థానం సహ్రుద్, అండర్-15బాలికల్లో శ్రీహ ఆరో స్థానం, అండర్-7 సమిక పదో స్థానం సాధించారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్‌కుమార్‌నాయుడు విజేతలను అభినందించారు. పోటీల్లో అమెరికా, కెన్యా, పాకిస్తాన్‌తో పాటు దేశం నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ పోటీలకు వర్షం ఆటంకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15: మహిళా క్రికెట్ పోటీలకు వర్షం ఆటంకం కలిగించింది. సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ మహిళా జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో చిత్తూరు-కృష్ణా, విశాఖపట్నం-సౌత్ జోన్, సెంట్రల్‌జోన్-నార్త్‌జోన్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లు రద్దు చేశారు. మంగళవారం పోటీలు యథావిధిగా కొనసాగుతాయని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.

నూతన కార్యవర్గానికి సన్మానం


అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న యువజన సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15: డీఎస్ఏ అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియం షటిల్ బ్యాడ్మింటన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు నెహ్రూ యువకేంద్రం జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, పీవీకేకే ప్రిన్సిపాల్ సుబ్బారావులను యువజన సంఘాల నాయకులు సన్మానించారు. సోమవారం స్థానిక నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, జయమారుతి, టీడీపీ నాయకులు ఎడపల్లి రాచానపల్లి మంజునాథ్ సభ్యులను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించాలి


మొక్క నాటిన డీఎఫ్ఓ వినీత్ కుమార్, అధికారులు

అనంతపురం న్యూటౌన్, జూలై 15: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎఫ్ఓ వినీత్ కుమార్ సిబ్బందికి సూచించారు. సోమవారం శింగనమల బీట్‌లో చేపట్టిన ఎన్‌జీటీ ప్లాంటేషన్‌ను డీఎఫ్ఓ పరిశీలించారు. దీంతోపాటు ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ఎంత అవసరమో, వాటి సంరక్షణ కూడ అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీనివాసులుతో పాటు డిప్యూటీ రేంజర్ ఉసేనప్ప పాల్గొన్నారు.

అనుమతి లేకుండా చెట్లు నరికితే ఉపేక్షించం

అనుమతి లేకుండా చేట్లు నరికితే ఉపేక్షించేది లేదని రేంజర్ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం స్థానిక వడ్డిపల్లి సమీపంలో అనుమతి లేకుండా చేట్లను నరుకుతున్నట్లు ఫిర్యాదు రావడంతో వేంటనే సంబంధిత అటవీశాఖ సిబ్బంది స్థానికంగా వెళ్లి పరిశీలించారు. అనుమతి లేకుండా చెట్టను తొలగించడం సరికాదని హెచ్చరించారు. మొదటి సారిగా అపరాధ రుసుం విధించి వదిలేశారు. మరో సారి పునరావృతమైతే జైలుకు పంపుతామని రేంజర్ శ్రీనివాసులు హెచ్చరించినట్లు ఆయన తెలిపారు.

నెమలిని సంరక్షించిన అటవీ అధికారులు

అనంతపురం రూరల్ రుద్రంపేటలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఓ నెమలిని స్థానిక పోలీసులు పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. స్పందించిన వారు వెంటనే వైద్యం చేయించి సాధారణ స్థితికి వచ్చే వరకు ఉంచుకొని తిరిగి జగదీష్ యాదవ్ ద్వారా అటవీ ప్రాంతంలో వదిలి వేయించినట్లు రేంజర్ శ్రీనివాసులు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయండి

● కలెక్టర్ వినోద్‌కుమార్


అరటి పిలకలను పరిశీలిస్తున్న కలెక్టర్

రాప్తాడు, జూలై 15: ఎలైట్ బయోటెక్నాలజీస్ లాంటి పరిశ్రమలు మరిన్ని ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లి సమీపం ఎంఎస్ఎంఈ పార్కులో ఏర్పాటు చేసిన ఎలైట్ బయోటెక్నాలజీ పరిశ్రమను కలెక్టర్ పరిశీలించారు. బయోటెక్నాలజీలో చేపట్టిన అరటి పిలకలను ఆయన పరిశీలించారు. అరటి పిలకలు ఏర్పాటు బాగుందన్నారు. ఉద్యానశాఖ డీడీ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ బయోటెక్నాలజీస్‌ని 2021-22లో 30 సెంట్లలో రూ.2.61 కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. ఏడాదికి 25 లక్షలు అరటి పిలకలు ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఇక్కడ జీ9, యాలక్కి, కర్పూర, చక్కెరకేళి, సుగంధాలు లాంటి రకాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ బయోటెక్నాలజీస్ ఎదుట మొక్కలు నాటారు. ఏపీఎంఐపీ పీడీ రఘునాద్‌రెడ్డి, బయో టెక్నాలజీస్ ప్రమోటర్ రాఘవేంద్ర, ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్ పాల్గొన్నారు.

హరిత అనంతగా మారుద్దాం

అనంతపురం టౌన్: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకొని హరిత అనంతగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయ ఆవరణలో కలెక్టర్‌తోపాటు డీఎంహెచ్ఓ ఈబీ దేవి పాల్గొని మొక్కలు నాటారు. ప్రతిరోజూ నీరుపోస్తానని, మొక్కను పరిరక్షిస్తానని, నా బిడ్డలతో సమానంగా నేను నాటిన మొక్కను కాపాడుకుంటానని డాక్టర్లు, వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుజాత, యుగంధర్, అనుపమ, గంగాధరరెడ్డి, నారాయణస్వామి, రవిశంకర్, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న కలెక్టర్, డీఎంహెచ్ఓ

చెరువు స్థలం ఆక్రమణపై విచారణ

అనంతపురంరూరల్, జూలై 15: మండలంలోని రాచానపల్లి పంచాయతీ సర్వే నంబరు-86 చెరువు స్థలం ఆక్రమణపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులు అక్కడికి వెళ్లి చెరువు స్థలంలో ఇళ్ల నిర్మాణాలు, బండలు పాతుకున్న వారితో వివరాలు సేకరించారు. గ్రామ సర్పంచు మా పొలం పక్క స్థలం ఉంది, అందులో ఇళ్లు నిర్మించుకోవచ్చని చెప్పడంతో స్థానికంగా నిర్మాణాలు చేసుకున్నట్లు అధికారులకు అక్కడి ప్రజలు వివరించారు. ఇంటి పట్టాలు అడిగితే మొదట ఇల్లు నిర్మించుకోండి పట్టాలు తర్వాత ఇప్పిస్తామని చెప్పాడన్నారు. చెరువు స్థలం ఆక్రమించారని పత్రికల్లో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. స్థానికంగా విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆక్రమణలపై కొతలు కూడా తీశామన్నారు.


ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

స్థానిక పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఏఈ క్రిష్ణకుమార్, మండల సర్వేయర్ ప్రతాప్‌రెడ్డి, వీఆర్వో రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పెద్ద సరిగెత్తు


గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

శింగనమల జూలై 15: మతసామరస్యానికి ప్రతీక నిర్వహించే మొహరం వేడుకలు నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మండల కేంద్రంలో పెద్ద సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నజలాలపురం, గురుగుంట్ల, గోవిందరాయునిపేట గ్రామాలకు చెందిన పీర్లు గ్రామంలో ఊరేగింపు చేస్తారు. ఈ పీర్లు దర్గా వద్దకు చేరుకుంటాయి. భక్తులు చక్కెర చదివింపులు చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న బీసీ సంక్షేమసంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్/టౌన్, జూలై 15: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు జన్మదిన వేడుకలను ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు జోగి రాజేంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ సంఘంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలకు నాయకత్వ లక్షణాలు నేర్పిన వ్యక్తి శంకర్రావు అన్నారు. నాయకులు జశ్వంత్, చిట్రా నాగరాజు, సగర శ్రీకాంత్, ఇమామ్ హుస్సేన్, బండి కాశీ, సంతోష్, కొడికి మధు, బాలకృష్ణ, శివరుద్రయ్య, పవన్, రాజ్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలి

అనంతపురం విద్య, జూలై 15: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీ వో 117ను రద్దు చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జల శివయ్య, ప్రధానకార్యదర్శి డెగావత్ రవీంద్ర సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా హక్కుచట్టం మేరకు ప్రైమరీ విద్య 1 నుంచి 5వ తరగతి మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోతన్నత విద్య 5 కిలోమీటర్లలోపు విధిగా కొనసాగాలన్నారు. గత ప్రభుత్వం సంస్కరణల పేరు చెప్పి జీవో 117ను తీసుకొచ్చి విద్యావ్యవస్థను విచ్ఛిన్నం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని, విద్యావ్యవస్థను ప్రగతి బాటలో పెట్టాలని కోరారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి

అనంతపురం సెంట్రల్, జూలై 15: దళిత, గిరిజనుల సంక్షేమ పథకాలు అమలుచేసేలా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేసీసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి డిమాండ్‌చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌లను నిర్వీర్యంచేసి పథకాలను రద్దుచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి పునఃప్రారంభించాలని కోరారు. డిమాండ్లతోకూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, లక్ష్మినారాయణ, నారాయణస్వామి, ఓబులేసు, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న నాయకులు


ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

నార్పల, జూలై 15: గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు సోమవారం దర్శించుకున్నారు. జిల్లా నాయకుడు ఆలం వెంకటనరసానాయుడు టీడీపీ నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌బాబు, పిట్టురంగారెడ్డి, ఎర్రనాగప్ప, ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల అక్రమాలపై విచారణ చేపట్టండి


ఎంపీడీఓ గీతావాణికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జూలై 15: వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీనాయకులు ప్రభుత్వ నిధులను అక్రమంగా కాజేశారని, వాటిపై వెంటనే విచారణ చేపట్టాలని మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధానకార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు ఎంపీడీఓను కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఎంపీడీఓ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు మండలపరిషత్, 15వ ఆర్థికసంఘం, జనరల్ ఫండ్ నిధులను స్వాహా చేశారన్నారు. పనులు చేపట్టకపోయినా చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేసి నిధులు కాజేశారన్నారు. వీ టన్నంటిపైన విచారణ చేపట్టి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు దివాకర్‌రెడ్డి, శంకరయ్య

అనంతపురం సెంట్రల్, జూలై 15: ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థి దశలోనే సేవాభావం అలవర్చుకోవచ్చని ఆర్ట్స్ కళాశాల, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు దివాకర్‌రెడ్డి, శంకరయ్య అన్నారు. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులను వారు అభినందించారు. వారు మాట్లాడుతూ ప్రశాంతి నిలయంలో నిర్వహించిన గ్లోబల్ యూత్ అడల్ట్ కాన్ఫరెన్స్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలందించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. ప్రిన్సిపాళ్లు జయరామిరెడ్డి, రామకృష్ణ, విజయలక్ష్మి, పీఓ వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ పీఓలు విష్ణుప్రియ, పద్మశ్రీ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం

రాప్తాడు, జూలై 15: మండలంలోని హంపాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షణ్ముఖ చికిత్స కోసం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన షణ్ముఖ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత మండల కన్వీనర్ పంపు కొండప్ప, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు చేత రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, రంగనాయకులు, సీతారాముడు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలే సమాధానం..!

● పరిష్కార వేదికలో కనిపించని అధికారులు


రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అనంతపురం రూరల్, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అనంతపురం రూరల్ మండలం అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సోమవారం అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం తీరుచూస్తే ఎవరైనా సరే ముక్కున వేలువేసుకోవాల్సిందే. ఉదయం 11గంటలైనా ఒక్కరంటే ఒక్కరు కూడా కార్యక్రమానికి హాజరు కాలేదు. దాదాపు 18 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఒక్కరు కూడా వచ్చింది లేదు. దీంతో సమస్యల పరిష్కారంకోసం వచ్చిన వారికి ఖాళీ కుర్చీలే సమాధానం ఇచ్చాయి. 11 గంటల సమయంలో పశువైద్యాధికారి రావడంతో కార్యాలయంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ కుర్చున్నారు. మిగిలిన అధికారులందరూ ఎక్కడికెళ్లారో తెలియదు. జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమంలో ఉన్నతాధికారులు సైతం సమయానికి ఖచ్చితంగా హాజరవుతారు. మరి మండల స్థాయిలో జరిగే కార్యక్రమం పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటం ఆయాశాఖల పరిధిలో సమస్యల కోసం వచ్చే వారికి సమాధానం లేకుండా పోతోంది.


అధికారుల కోసం కార్యాలయ ఆవరణలో వేచివున్న ప్రజలు

అక్రమ కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకోండి


హోం మంత్రితో తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, జూలై 15: వైసీపీ హయాంలో జిల్లాకు చెందిన తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను తెలుగు మహిళలు కోరారు. సోమవారం విజయవాడలో ఏపీ సచివాలయంలోని ఆమె చాంబర్‌లో మాజీ కార్పొరేటర్లు విజయశ్రీరెడ్డి, సరళ, తెలుగు మహిళ జిల్లా అధికార ప్రతినిధి వసుంధర, కవిత మంత్రిని కలిసి విన్నవించారు. అక్రమ కేసులపై విచారణ చేపట్టి తగిన న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హోం మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు


హోం మంత్రిని కలిసిన జితేంద్రగౌడ్, గంపన్న

అనంతపురం అర్బన్, జూలై 15: హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు కలిశారు. సోమవారం విజయవాడ సచివాలయంలోని ఆమె చాంబర్‌లో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, మాజీ ఎంపీపీ వీరేష్, సాకే ధనుంజయ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు


నడింపల్లిలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

నార్పల, జూలై 15: గూగూడు బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని నడింపల్లి గ్రామం నుంచి గూగూడు వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఆదేశాల మేరకు ఎంపీడీఓ, ఆలయ ఈఓ సహకారంతో మట్టి రోడ్డు వేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

వీల్‌చైర్ల వితరణ


ఆస్పత్రికి వీల్‌చైర్స్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూలై 15: మండలంలోని కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వీల్‌చైర్స్ వితరణ చేశారు. సోమవారం ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు మనోజ్‌కు రెండు వీల్స్ చైర్స్‌ను తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి అందజేశారు. ఆస్పత్రి వెళ్లే దారిలో ముళ్లకంపలు పెరిగిపోవడంతో వాటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు వెంకటరాముడు, జయరాములు, ధర్మేంద్ర, రంగా, సుబ్బరాయుడు, గోపాల్, వెంకటేష్, శివ, సాయి పాల్గొన్నారు.

నీటి సమస్యను తీర్చండి: ఎమ్మెల్యే


జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 15: బుక్కరాయసముద్రం మండలంలోని అనంతసాగర్ కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని జి ల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. సోమవారం జడ్పీ కార్యాలయంలో తాగునీటి సమస్యలపై చైర్‌పర్సన్‌ను కలిశారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ అనంతసాగర్ కాలనీలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. కాలనీలో నీటి సమస్యలు లేకుండా చూస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

అనధికార వెంచర్లపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె, జూలై 15: మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో వేసిన అక్రమ వెంచర్లు వేసినవారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాగరాజు, సీపీఎం నాయకులు చెన్నారెడ్డి తహసీల్దార్‌ను కలిశారు. కల్లూరులో పలువురు నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేశారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆస్తి విషయంలో వివాదం

అనంతపురం క్రైం, జూలై 15: నగరంలోని తగరకుంట కొండారెడ్డి కుటుంబసభ్యుల మధ్య ఆస్తి విషయంలో వివాదం తలెత్తింది. సోమవారం సాయినగర్ ఐదో క్రాస్‌లో కొన్ని దుకాణాలను ప్రారంభించే విషయంలో కొండారెడ్డి కుమారుడు పరంధామరెడ్డికి, సోదరుడు కమలనాథరెడ్డి మధ్య వివాదం తలెత్తింది. దుకాణాలను బాడుగకు ఇవ్వాలని చూస్తుంటే ఆ ఆస్తి తమదేనంటూ బాబాయి కమలనాథరెడ్డి అడ్డుకుంటున్నారనేది పరంధామరెడ్డి ఆరోపణ. గతంలోనూ తమను గన్‌తో బెదిరించాడని ఆరోపించారు. ఈ విషయంపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బొలెరో వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు


గాయపడిన రమాదేవి

గార్లదిన్నె, జూలై 15: మండలంలోని ఓబుళాపురం కొట్టాల గ్రామం వద్ద సోమవారం లగేజీ బొలెరో వాహనం బోల్తా పడిన ఘటన ఇద్దరు గాయపడ్డారు. శింగనమల మండలం చిన్నజాలాలపురం గ్రామానికి చెందిన రమాదేవి, లక్ష్మితో పాటు మరో 11 మంది కూలీలు చీనీకాయలు పెరికేందుకు లగేజీ వాహనంలో గార్లదిన్నెకు వెళ్లారు. వర్షం పడడంతో చీనీ కాయలు పెరికేందుకు వీలుకాలేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి అదే వాహనంలో వెళుతున్నారు. ఓబుళాపురం కొట్టాల వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించారు. దీంతో రోడ్డుసైడ్‌కు వాహనం వాలిపోయింది. ఈ ప్రమాదంలో రమాదేవి, లక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రాయదుర్గం రూరల్, జూలై 15: పట్టణంలోని బీటీపీ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన ఆనందప్ప భార్య యశోదమ్మ సోమవారం ఉదయం స్థానిక బీటీపీ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా.. గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు.

గరుడాపురం సమీపంలో మరో మహిళకు..

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గరుడా పురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శెట్టూరు మండలం బొచ్చుపల్లి గ్రామానికి చెందిన దంపతులు శ్యామలమ్మ, కుళ్లాయప్ప సోమవారం పని నిమిత్తం కళ్యాణదుర్గం పట్టణానికి బైక్‌పై వచ్చారు. పని అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. అయితే గరుడాపురం దాటగానే కూరగాయలు కిందికి పడటంతో వాటిని తీసుకునేందుకు ఆమె దిగింది. ఈ క్రమంలో గుర్తు తెలియని ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవగా.. స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్, జూలై 15: మండలంలో అర్హులైన కౌలురైతులను పంట సాగుదారుని హక్కు పత్రాలను(సీసీఆర్సీ కార్డులను) పంపిణీ చేస్తామని, వ్యవసాయ అధికారి మహేంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో 270 నుంచి 300 మంది దాకా కౌలు రైతులను గుర్తించి సీసీఆర్సీ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. వీరికి బ్యాంకు ద్వారా రుణసదుపాయాన్ని కల్పిస్తామన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెళుగుప్ప: మండలంలోని అర్హులైన కౌలు రైతులు అర్హత ధ్రువీకరణ పత్రాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హరినాథరావు, వ్యవసాయాధికారి, పృథ్వీసాగర్ ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న వారు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. మండలానికి 260 మంది రైతులకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. భూ యజమాని నుంచి రాయించుకున్న కౌలు పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

కుందుర్పి, జూలై 15: మండలంలోని తెనగల్లు ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకం వల్ల అర్హత లేని వారికి ఉపాధి బిల్లులు మంజూరయ్యాయి. దీనిపై గ్రామస్థుడు చంద్రశేఖర్ సోమవారం జిల్లాకేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తెనగల్లు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రవి అర్హత లేకున్నా.. అంగన్‌వాడీ వర్కర్ అన్నపూర్ణ పేరు మీద ఉపాధి బిల్లులు మంజూరు చేశాడని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు చేసిన ఉపాధి హామీ పనులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

తాడిపత్రి, జూలై 15: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డులో ఉన్న పప్పులబట్టీ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై షెక్షావలి గాయాలపాలయ్యాడని రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన షెక్షావలికి తల్లిదండ్రులు ఎవరూ లేకపోవడంతో మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో మద్యంమత్తులో ఉన్న అతను ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్రం పోస్తుండగా ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

మండీ మర్చంట్ కేంద్రం ప్రారంభం

తాడిపత్రి, జూలై 15: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఓంశాంతినగర్ ఆర్చ్ వద్ద మండీ మర్చంట్ కేంద్రాన్ని తహసీల్దార్ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిలో కందిబేడలు రూ.160, స్టీమ్‌రైస్ రూ.49, పచ్చిబియ్యం రూ.49తో కేంద్రంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సెక్రటరీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన

పెద్దపప్పూరు, జూలై 15: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం కుష్ఠు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు ఉషారాణి మాట్లాడుతూ ఎవరికైనా శరీరంపై రాగిరంగులో మచ్చలు ఉండి స్పర్శ లేకుండా ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆశాకార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రాగిరంగు మచ్చలున్న వారిని గుర్తించి ఆస్పత్రికి పంపాలన్నారు. వ్యాధి మొదటిలోనే చికిత్స చేస్తే వ్యాధి నయమవుతుందని చెప్పారు. సదస్సులో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, యూనిట్ అధికారి శర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు వినతుల స్వీకరణ

రాయదుర్గం రూరల్, జూలై 15: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. 74 ఉడేగోళం, వడ్రవన్నూరు గ్రామాలకు చెందిన రైతులు నూతన పట్టాదారు పాసుపుస్తకాల కోసం రెండు వినతులు, పట్టణంలోని గౌడ లేఅవుట్‌లో అక్రమంగా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఒక వినతి అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎనిమిది మంది ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్, జూలై 15: పట్టణంలోని స్వామి వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల లో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎనిమిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామలింగప్ప తెలిపారు. గ్రాస్ రూట్స్ ఆల్‌సెక్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబాఫక్రుద్దీన్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్టర్ వివాహం

కణేకల్లు, జూలై 15: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో సోమవారు ఓ ప్రేమ జంటకు గ్రామపెద్దలు స్థానిక సచివాలయంలో రిజిస్టర్ వివాహాన్ని జరిపించారు. ఇప్పటి వరకు రిజిస్టర్ పెళ్లిల్లు కేవలం సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లోనే జరిగేవి. తాజాగా సచివాలయంలో చేశారు. గ్రామంలో దళితకులానికి చెందిన ఎన్నప్ప, సుమలత ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు ప్రేమికుల తల్లిదండ్రులను ఒప్పించి సచివాలయంలో రిజిస్టర్ వివాహం జరిపించారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో ఈ పెళ్లి జరిగింది. కార్యక్రమంలో గ్రామపెద్దలు నెట్టికల్లప్ప, లోకేష్‌గౌడ్, ప్రభు, హనుమంతరెడ్డి, చిక్కణ్ణ, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

● ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ వనజా అక్కమ్మ

కుందుర్పి, జూలై 15: బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని, వాటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ వనజాఅక్కమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని అపిలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాలను నివారించి, ఆడబిడ్డలను కాపాడుకుందామనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఐసీడీఎస్ సీడీపీవో వనజా అక్కమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలకు చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల శారీరకంగా అనారోగ్యం పాలవుతారన్నారు. మానసిక రుగ్మతలకు కూడా గురవుతారన్నారు. ప్రసవ సమయంలో ప్రాణాలు కూడా కోల్పోయేప్రమాదం ఉందన్నారు. కావున ఎవరూ బాల్యవివాహాలు చేయరాదని తెలిపారు. ఎవరైనా అలా చేస్తే బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం శిక్షకు అర్హులవుతారని చెప్పారు. వివాహం నిర్వహించిన, సహకరించిన ప్రతిఒక్కరిపైనా చర్యలుంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 100, 112లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ తిప్పేస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, హెచ్‌ఎం ధనుంజయ, ఉపాధ్యాయులు జయశ్రీ, జయరాంనాయక్, నళిని, సుగుణ, జయలక్ష్మీ, వైద్య సిబ్బంది భార్గవి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కడవకల్లులో భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు


కడవకల్లులో పీర్ల ఊరేగింపు


పామిడిలో కొలువుదీరిన పీర్లు


బెళుగుప్పలో అగ్నిగుండంను వెలిగిస్తున్న గ్రామస్థులు

పుట్లూరు, జూలై 15: మండలంలోని కడవకల్లు గ్రామంలో సోమవారం సాయంత్రం చిన్నసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. పీర్లచావిడి వద్ద భక్తులు చక్కెర చదివింపులు చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర, నేత్రపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి చిన్నసరిగెత్తు ఘనంగా జరిగాయి. భక్తులు పీర్ల మఖానాల వద్ద చక్కెర చదివింపులు చేయించి మొక్కలు తీర్చుకున్నారు. ముజావర్లు పీర్లను అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా మొహరం వేడుకలు

పామిడి : పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా పీర్ల మకానాల్లో ముజావర్లు పీర్లను వెండిగొడుగులతో అలంకరించి కొలువుదీర్చారు. ఎదుట అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకుంటున్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలో సోమవారం మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పీర్ల మఖానానికి వచ్చి అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పీర్లకు చక్కెర చదివింపులు చేయించి, పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పీర్లచావిడి ప్రారంభం

యాడికి: మండలకేంద్రంలో దాతల సహకారంతో పునఃనిర్మించిన అలీ అక్బర్ పీర్లచావిడిని టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ సోదరులే ఎక్కువగా మొహరం వేడుకలను నిర్వహిస్తారన్నారు. అందరూ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు ఏర్పాటు


రోడ్డును చదును చేయిస్తున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, జూలై 15 : మండల కేంద్రంలో శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం లేక గ్రామస్థులు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో స్థానికులు ప్రస్తుత మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని ఆయన అప్పుడు హామీనిచ్చారు. కూటమి అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకులు గత పది రోజుల నుంచి శ్మశానవాటికలో కంపచెట్లు తొలగించారు. అలాగే రాకపోకలకు ఇబ్బంది లేకుండా సోమవారం రోడ్డును చదును చేయించారు. ఎన్నో యేళ్ల సమస్య పరిష్కారమైనందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బొబ్బ వ్యాధి నివారణకు టీకాలు

బెళుగుప్ప, జూలై 15: మండలంలోని బ్రాహ్మణపల్లి, జీడిపల్లి గ్రామాల్లో పశువులకు సోమవారం బొబ్బ వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి రమేష్ బాబు తెలిపారు. ఉచితంగా టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు వినియోగించుకోవాలన్నారు. బ్రాహ్మణపల్లిలో 126, జీడిపల్లిలో 330 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రసాభాసగా సమావేశం

కూడేరు, జూలై 15: గొట్కూరు గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులపై జరిగిన సమావేశం రసాభాసగా సాగింది. గత రెండ్రోజుల క్రితం సమావేశం నిర్వహించగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో సోమవారం సాయంత్రం తిరిగి నిర్వహించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఉపాధి పనులు చేయకుండా కొందరు బిల్లులు తినేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చెప్పిన వారికి అధికారులు బిల్లులు చేశారంటూ మండిపడ్డారు. దీంతో సమావేశం రసాభాసగా సాగింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఉరవకొండ, జూలై 15: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో 700మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని సూచించారు. అలాగే రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యులు వెంకటేష్ నాయక్ సిబ్బందితో కలిసి మొక్కలునాటారు. కార్యక్రమాల్లో అటవీ శాఖాధికారి కరిముల్లా, ఎఫ్‌బీవో సతీష్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ మస్తానప్ప, అధ్యాపకుడు రాజేష్, సీహెచ్‌వో నాగరంగయ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులాపురంలో..

పుట్లూరు: మండలంలోని ఓబులాపురం గ్రామంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు మల్లేశ్వరమ్మ, అటవీ అధికారులు మొక్కలు నాటారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘాల మహిళల సమావేశం

యాడికి, జూలై 15: మండలకేంద్రంలోని సమావేశభవనంలో సోమవారం గ్రామైక్య సంఘాల మహిళల సమావేశం జరిగింది. ఇందులో వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారన్నారు. సంఘాల ద్వారా పొందుతున్న రుణాలతో టైలరింగ్, బ్యూటీపార్లర్‌లు, కిరాణాదుకాణాలు, టెక్స్‌టైల్స్ వంటివి నిర్వహిస్తూ ఆర్థిక వృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. స్వయం సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమన్నారు. సమావేశంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన జితేంద్రగౌడ్


మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లు, జూలై 15: రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు పలువురు మంత్రులను మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ సోమవారం భేటీ అయ్యారు. అమరావతిలోని సచివాలయానికి వెళ్లిన జితేంద్రగౌడ్ మంత్రి కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గుత్తి పట్టణాధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, నాయకుడు కురుబ సురేశ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

ఉరవకొండ: అమరావతిలోని సచివాలయంలో ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌ను వజ్రకరూరు మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చానట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు సన్మానం


గుమ్మనూరు జయరాంను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్, జూలై 15: తెలంగాణ రాష్ట్రం అలంపూర్‌లో సోమవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్‌తో పాటు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని అక్కడి వాల్మీకి ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వాల్మీకులకు ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ప్రజా ప్రతినిధులు నీలి, శీను తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్‌కు ఆర్థికసాయం

తాడిపత్రి, జూలై 15: పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన పెయింటర్ రమేష్‌బాబుకు పెయింటర్స్ అసోసియేషన్ వారు సోమవారం రూ.46,500 ఆర్థికసాయం అందించారు. యాడికి మండలకేంద్రంలో రమేష్‌బాబు పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు 20అడుగుల నుంచి జారిపడి గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం, కుటుంబ పోషణ నిమిత్తం తమవంతుగా అసోసియేషన్ తరపున ఈ సాయం అందించామని అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు.

18న రుక్మిణీపాండురంగస్వామి రథోత్సవం


రాయదుర్గంలోని రుక్మిణీ పాండురంగస్వామి

రాయదుర్గం రూరల్, జూలై 15: పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీన రథోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, విష్ణుసహస్రనామావళి, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 7:30కు పలకీ ఉత్సవం, రాత్రి 10 నుంచి ఉదయం 18వ తేదీ 6 గంటల వరకు భజన కార్యక్రమం ఉంటాయన్నారు. 8గంటలకు పట్టణ పురవీధుల్లో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

నేటి నుంచి విఠోబస్వామి బ్రహ్మోత్సవాలు

పామిడి: పట్టణంలోని రంగ సుబేదిర్కా భగవాన్‌దాస్ విఠోబస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కృష్ణయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు 16న మహాగణపతి పూజ, నవగ్రహ ఆహ్వానము, అభిషేకాలు, శ్రీలక్ష్మీ వ్రతము, 17న గరుడ వాహనసేవ, 18న హంసవాహన సేవ, 19న హనుమ వాహన సేవ, 20న ఐరావత వాహన సేవ, మధ్యాహ్నం కల్యాణోత్సవం, 21న బ్రహ్మరథోత్సవము, 22న అశ్వవాహనసేవ, వసంతోత్సవము నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

సీబీ రోడ్డులో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి పర్యటన


చిరువ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, జూలై 15: పట్టణంలోని సీబీరోడ్డులో సోమవారం సాయంత్రం టీడీపీ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గంపవ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారం ఎలా ఉందంటూ ఆరాతీశారు. అనంతరం గాంధీసర్కిల్‌లో ఉన్న టీస్టాల్‌లో ప్రజలతో కలిసి టీ తాగారు. ఆయన వెంట నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఖాదర్, సుధీర్‌రెడ్డి, యువరాజు, శివ, కిరణ్‌కుమార్, హేమంత్‌కుమార్, రమేష్, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు


శేఖర్ (ఫైల్)

యాడికి, జూలై 15: మండలంలోని రాయలచెరువు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన శేఖర్ (45), మల్లికార్జున కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఇరువురు ఆదివారం ఉదయం యాడికి మండలం పెద్దపేట గ్రామ సమీపాన కూలీ పనులకు బైక్‌పై వచ్చారు. పని అనంతరం రాత్రి 9గంటల సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. రాయలచెరువు సమీపంలోకి వెళ్లగానే జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108వాహనంలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శేఖర్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మల్లికార్జునను మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. శేఖర్ తండ్రి మాదన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామన్నారు. మృతుడికి భార్య నిర్మలతోపాటు ముగ్గురు సంతానం ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి ..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి, జూలై 15: పట్టణంలోని సంజీవనగర్ పార్కు వద్ద మద్యం సేవించి పడిపోయిన గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి పార్కు వద్ద పడిపోయాడు. సోమవారం ఉదయం ఎంతసేపటికి లేవకపోవడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి 35 ఏళ్ల వయసు ఉంటుందని, బ్లూ షర్ట్ ధరించాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, జూలై 15: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డు రైల్వేగేటు సమీపంలో సోమవారం రైలుకిందపడి నాగమునిరెడ్డి (45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన నాగమునిరెడ్డి లారీ ట్రాన్స్‌పోర్టులో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. మృతుడికి భార్య సువర్ణతోపాటు కుమారుడు నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఆయన తెలిపారు.

మల్లప్పగేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి..

గుంతకల్లుటౌన్: గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని మల్లప్ప గేట్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్‌ఐ రామదాసు తెలిపారు. మృతుడికి 38 ఏళ్ల వయసు ఉంటుందని, 5.5అడుగుల ఎత్తు ఉంటాడని, పసుపు రంగు రౌండ్ నెక్ టీషర్ట్, కార్బన్‌బ్లాక్ ట్రాక్ ప్యాంట్ ధరించాడని, శరీరంపై జందెం ఉందని అన్నారు. మృతుడి వద్ద నుంచి ఇక ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉపకాలువల పరిశీలన

బొమ్మనహాళ్, జూలై 15: మండలంలోని గోవిందవాడ గ్రామ సమీపంలో 9, 9ఏ బ్రాంచ్ కాలువలను హెచ్చెల్సీ కణేకల్లు సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటి సోమవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ధ్వంసమైన డ్రాపులు, తూములను, ఎల్ఆర్-1, ఎల్ఆర్-2 కాలువల దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువ మరమ్మతులకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామన్నారు. 9ఏ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 10 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. బ్రాంచ్ కాలువ మరమ్మతు చేయించి బొల్లనగుడ్డం, కళ్లహోళ, తార్కాపురం, గోవిందవాడ గ్రామాల చివరి ఆయకట్టు భూములకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమనాథ్‌గౌడ్, ఎస్‌జీ వన్నూరుస్వామి, కటెంబ్లి సుంకన్న, బంగి లోకేష్, నటరాజ్, రాతింటి వన్నూరుస్వామి, చెవులు వన్నూరుస్వామి, సొంటి వన్నూరుస్వామి, మాజీ ఎంపీటీసీ వేమన్న, మాజీ సర్పంచ్ దేవేంద్రప్పలు ఉన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి

గుత్తి, జూలై 15: దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో పెన్షనర్స్ అసోసియేషన్ వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఉప్పు సత్యాగ్రహంలో ఆమె కీలకంగా వ్యవహరించారన్నారు. అలాగే సంఘ సంస్కర్తగా, రచయిత్రిగా, న్యాయవాదిగా రాణించారని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్, సహాయకార్యదర్శి కుళ్లాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

మొహరంను ప్రశాంతంగా జరుపుకోండి

బొమ్మనహాళ్, జూలై 15: మండల ప్రజలు మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ రామాంజినమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఘనంగా ధన్వంతరి యిష్టి

తాడిపత్రి, జూలై 15: పట్టణంలోని ఎస్ఎల్ఎన్ వరహాలు గార్డెన్స్‌లో లోకకల్యాణార్థం జరుగుతున్న భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ధన్వంతరియిష్టిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల ఆరాధన, హోమాలు, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామివారు ప్రవచనాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యల్ని పరిష్కరించాలని వినతి

గుంతకల్లు టౌన్, జూలై 15: పట్టణంలోని 7వ వార్డులో పలు సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు సోమవారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్ మాట్లాడుతూ స్థానిక అంకాలమ్మ ఆలయం దేవాలయం వద్ద డ్రైనేజీలు లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కొనకొండ్ల గేట్ వరకు రోడ్డు సౌకర్యం లేదన్నారు. కంకర తేలిన రాళ్లతో ఉన్న దారిలో వాహనదారులు, పాదచారులు నానాఅవస్థలు పడుతున్నారన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు బండారు కృష్ణమూర్తి, విజయలక్ష్మి, జేసీ వెంకటేశ్వర్లు, వెంకటరాఘవ, మునిరాజు పాల్గొన్నారు.